**జరిగిన కథ :** కాశీమజిలీల్లో ప్రస్తుతం సప్తమిత్ర చరిత్రలో ఉన్నాం. కాళిదాస మహాకవి రచించిన మేఘసందేశంలోని యక్షుడు కూడా ఒక ప్రధాన పాత్రగా.. ఏడుగురు మిత్రుల మధ్య ఈ కథ నడుస్తుంది. కాళిదాసు, భోజరాజు కూడా ఇందులో ఉంటారు. ఏడుగురు మిత్రులలో ఇద్దరు తప్ప మిగిలినవారు భోజరాజు ఆస్థానానికి వచ్చారు.

## కాశీ మజిలీ కథలు 123

అనుసృజన: నేతి సూర్యనారాయణ శర్మ



# భోజరాజుగారి కొలువు

భోజరాజుగారి కొలువుకూటంలో విద్వాంసుల సభ మొదలైంది. కాశీ నుంచి వచ్చిన ఏడుగురు మిత్రులలో.. కుచుమార, గోనర్దీయ, చారాయణ, సువర్ణ నాభ, గోణికాపుత్రులు అనే ఐదుగురూ ఒకవైపు కూర్చున్నారు. మరోపక్క కాళిదాసుతోపాటుగా దండి, భవభూతి, శంకరుడు మొదలైన వారందరూ ఆసీనులయ్యారు. కుచుమారుడు పైకిలేచి..

''మహారాజా! మేమంతా కాశీలో గురుకులవాసం చేసి వచ్చాం. మీ సంస్థాన పండితుల ప్రఖ్యాతిని విని వారితో ప్రసంగించడానికి వచ్చాం. మా ప్రతిభ చూసి, మాకు కూడా మీ కొలువులో తగిన స్థానాలు లభిస్తాయనే ఉద్దేశంతో ఉన్నాం. మాలో ఎవరితోనైనా సరే.. కాళిదాసుగారు వాదం చేస్తే బాగుండునని మా కోరిక'' అన్నాడు.

అందుకు శంకరుడు..

''బాబూ! మీ మాటలు గర్వభూయిష్టంగా ఉన్నాయి. కాళిదాసుగారిని మించిన పండితుడు ఈ ఆస్థానంలో లేడు. ఆయనతో వాదించాలంటే మధ్యవర్తి ఉండాలి. దానికి బ్రహ్మయో, బ్రహ్మపత్ని అయిన సరస్వతియో దిగిరావాల్సి ఉంటుంది. మీకోసం అంతపని చేయడం సాధ్యం కాదు కనుక, వేరెవరితో అయినా వాదం కోరుకోండి'' అని సలహా చెప్పాడు.

కుచుమారుడు మొదలైనవారంతా అందుకు ఒప్పుకొన్నారు. ఇతర పండితులతో చాలా ప్రసంగాలు జరిగాయి. వారిలో అనేకమందికి బిరుదులు, కానుకలు వేనవేలుగా లభించాయి. సభ ముగిసిన తరువాత భోజరాజు.. గోనర్దీయుడు, కుచుమారులను ఉద్దేశించి..

''ఆనాడు నేను మిమ్మల్ని పురందరపురంలో కలుసుకున్నాను. ఆనాడు సరస్వతి సమక్షంలో మీ ప్రతిభను ప్రత్యక్షంగా చూశాను'' అని పలికాడు.

ఆ మాటలతో మిత్రులందరూ ఒక్కసారి ఆశ్చర్యంతో భోజరాజుకేసి తేరిపార చూశారు.

అప్పుడు సువర్ణనాభుడు పైకిలేచి, భోజరాజుతో..

''మహారాజా! దయచేసి మాకు మీతో ఏకాంత సమావేశానికి అవకాశం ఇప్పించండి. మేము మా గోడు కొంత చెప్పుకోవాల్సి ఉంది...'' అని కోరాడు.

భోజరాజు అందుకు సమ్మతించాడు. ఐదుగురు మిత్రులతోపాటు, కాళిదాసు మాత్రమే అక్కడ ఉన్నారు. అప్పుడు చారాయణుడు ఇలా చెప్పాడు.

''మహారాజా! నేను ఇక్కడికి సమీప అరణ్యంలో ఒక సిద్ధుణ్ని చూశాను. ఆయనకు వన్యమృగాలను ఐకమత్యంగా కలిసిమెలిసి బతికేలా చేయడం వచ్చు. ఇంకా అనేక విద్యలు వచ్చు. ఆయన నాకు గురూపదేశం చేసే సమయంలో కుట్రపన్ని భైరవుడనే దుర్మార్గుడు ఆయన తల పగులకొట్టాడు. నా నెత్తిమీద ఆకుపసరు పూసి నన్ను ముందుగా గాడిదను, తరువాత మేకను చేశాడు!''.

''ఆ.. భైరవుడా! వాడే మా మహారాణిని ఎత్తుకుపోయాడు'' అని భోజరాజు ఆవేశపడ్డాడు.

''ఆ సంగతి కూడా వస్తుంది ప్రభూ! చనిపోయిన సిద్ధుని విద్యలన్నీ మా కుచుమారునికి దైవవశాన పట్టుబడ్డాయి. ఇక మా గోనర్దీయుడు ఒక బ్రహ్మరాక్షసుని కారణంగా విద్యలు సాధించి, చిన్న రాజ్యానికి రాజయ్యాడు'' అని చెప్పి కూర్చున్నాడు చారాయణుడు.

అప్పుడు సువర్ణనాభుడు పైకి లేచాడు.

''నిజానికి మేం ఏడుగురం మిత్రులం ప్రభూ! కాశీలో చదువు ముగించుకుని, వేర్వేరు ప్రాంతాల నుంచి ధారానగరానికి వస్తున్నాం. దారిమధ్యలో నాకొక యక్షకాంత పరిచయమైంది. ఆమెను వివాహం చేసుకుని, సంగీతసభలు నిర్వహించి.. నేను పొట్ట పోషించుకుంటున్నాను. నా భార్యకు అక్క బావలున్నారు. నా తోడల్లుడైన యక్షుడు మరెవరో కాదు.. మన కాళిదాసుగారి మేఘసందేశంలోని యక్షుడే!'' అని చెప్పి కూర్చున్నాడు.

భోజరాజు ఒకసారి తలతిప్పి కాళిదాసువైపు గౌరవ పురస్సరంగా చూశాడు.

అప్పుడు గోణికాపుత్రుడు..

''ఆ యక్షుణ్ని మొదటిసారి చూసింది మా దత్తకుడు ప్రభూ! వాడే మొట్టమొదటగా ఈ ధారానగరానికి వచ్చాడు. అతని తరువాత నేను వచ్చాను. తమ కుమారుడైన చిత్రసేనుడికి చారుమతిని కూర్చినవాణ్ని నేనే. ఇంతకూ మా దత్తకుడు ఏమైపోయాడో తెలియలేదు. యక్షుని శాపం వల్లనే అతని రూపం మారిందని తరువాత తెలియవచ్చింది. ప్రస్తుతం చారుమతిగా మీ చిత్రసేనుల వారి భోగకాంతగా ఉన్నది మా దత్తకుడు